# చిచ్చుల పిడుగు



'హల్లో ప్రకాశం! ఖులాసా?'- ఆపుకోలేని ఆశతో పలకరించాడు ఆనందరావు, అతని మనస్సులో ఏదో తీవ్రమయిన ఘర్షణ, చూసీ చూడనట్టు తప్పుకున్నాడు ప్రకాశం.

పీక తీసివేసినట్టు ఫీలయ్యాడు ఆనందరావు, అవమానంతో తనలో తను కుంచించుకు కుంగిపోయాడు.

'ఛఛ!- ఏం ఖర్మ? ఈ మహా-నగరంలో నన్ను గుర్తించే వాడు ఒక్కడూ లేడా? నా జీవితాశ

కాముక

యం ఏమిటి? అసలు నేనీ మానవ జన్మ ఎత్తింది ఎందుకోసం? వ్యక్తిత్వమే కథ మనిషికి ముఖ్యం? అది కాస్తా లోపించినప్పుడు ఎందుకొచ్చింది బతుకు?' ఈ విధమైన ప్రశ్న పరంపర ఆనందరావును పట్టి ఊపేసింది. జుత్తు పీకేసుకున్నంత రియాక్షన్ అతని ముఖ కవళికలో వెల్లడయింది.

ఆనందరావు తాలూకాఫీసు గుమాస్తా ఉద్యోగంలో ప్రవేశించి ఆరేళ్ళు పైబడింది. ప్రభుత్వ ప్రమేయం లేకుండా 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని వల్లెవేసుకుంటూ, అయిదుగురు పిల్లల తండ్రి అనిపించుకున్నాడు. ఆరో కాన్పుకి అరవై రూపాయిలు అప్పు చేసి, అవసోపాలు పడుతూ భార్యామణిని పుట్టింటికి బండి ఎక్కించాడు.

భార్యా పిల్లలూ ఇక్కడ ఉండి ఉంటే, ఆనందరావు ఇంత ఇరకాటంలో పడేవాడు కాదు. ఆఫీసులో కాకపోయినా, ఇంటోనయినా తను ఒకడున్నాడని గుర్తింప బడేవాడు, లేదా గుర్తింప జేసుకునేవాడు,

ప్రతి రోజూ, ప్రతి క్షణం ఎవరో ఒకరిచేత తన్ను గుర్తింప జేసుకోవాలి. ఇదే ఆనందరావుకి పట్టిన యావ, తపన, అతని తపస్సు. ఇందుకోసం అతను తిండీ, నిద్రా, లేకుండా కాయ శక్తులా తంటాలుపడతాడు.

* * *

ఆనందరావూ ప్రకాశం ఇద్దరూ తాలూకాఫీసులో ఒకేసారి ప్రవేశించారు. పక్క పక్క సీట్లు, ఇప్పటికి సర్వీసు పదహారేళ్ళు. ఆనందరావు హెడ్‌క్లార్కుగా ప్రమోషనై పైకి ఎక్కినట్టు నేటి తాజావార్త. ఈ పదవిని గురించి అతను ఊహించే ఊహాలు అన్నీ ఇన్నీ కావు.

'ఇంటినించి బయల్దేరింది మొదలు ఇహ ప్రతివాళ్లూ అభినందన పూర్వకంగా ఆశ్రయింపు ధోరణిలో పలకరిస్తారు. కాబోలు! ముసిముసి నవ్వులతో ప్రతివందనం చెయ్యాలిగా? జోడించిన హస్తాలువిడదియ్యటానికే వీలుండదే! అంతా కొత్త జీవితం. లోకమంతటికీ తనతో అవసరమే! అందరి జీవితాలూ అతని పిడికిట్లో ఇమిడివుంటాయి. హెడ్ క్లార్కు ఉద్యోగం అంటే సామాన్యమా?'- ఇలాంటి తియ్యతియ్యటి కలలెన్నో!

ఇవాళ ఆఫీసు చేరుకుని సీటులో కూర్చోబోయేలోగా తోటి గుమాస్తాలందరూ జోహార్లర్పించి జేజేలు కొడతారు అని అనుకుంటూనే వెళ్ళాడు ఆనందరావు. కాని- అనుకున్న దొకటి, జరిగింది మరొకటిను ఆఫీసులో నిన్నటికి ఇవాళ్టికి తేడా

ఏమీ కన్పించలే. ఒహో తనకు ప్రమోషన్ వచ్చిన వైనం వీళ్ళ కింకా తెలిసివుండదు లాగుంది అని బలవంతాన మనస్సు సరిపెట్టు కున్నాడు. అయితే పక్కసీటులో కూచుని పనిచేసే ప్రకాశం ఉదాసీనత మట్టుకు ఎంతమాత్రం సహించ లేకపోయాడు.

• • •

ఆనందరావులో అప్పటప్పటికి చెప్పకుండా పొటమరించే ఫీలింగ్సు అతని భార్యకు పరిపాటి. ఇలాంటి చిర్రుబుర్రులన్నీ ఎప్పటికప్పుడు సర్ది పుచ్చి, వాతావరణం నార్మల్‌కు తీసుకువస్తూంటుంది. కాని, ఆమె కూడా అతీతమయిన విషయమొకటి జరిగిపోయిం దిప్పుడు, ఆఫీసులో-

'ఏమిటీ, మన శంకరం అందరికీ ఆహ్వాన పత్రిక లేవో పంచిపెడుతు న్నట్టుంది?' ఆత్రంతో ప్రశ్నిం చాడు ఆనందరావు.

'అవునండీ. పెళ్ళిట, వచ్చేగురు వారం!' సావధానంగా సమాధానం చెప్పాడు, పక్కనున్న గుమాస్తా.

దురదృష్టవశాత్తు, శంకరంచేత పట్టుకొచ్చిన పెళ్ళిలేఖలన్నీ శీదాగా అయిపోయినై, ఏం చెయ్యడం?- ఒక్కొక్కళ్ళ దగ్గరికీ పర్సనల్‌గా వెళ్ళి క్షమాపణ చెప్పుకుని, 'తప్ప కుండా వచ్చితీరాలి. మీరు రాక పోయ్యారంటే మావాళ్ళు చాలా చాలా బాధ పడతారు' అంటూ ప్రాధేయ పూర్వకంగా మరిమరి చెప్పసాగాడు.

ఇంతవరకు అలా సలుగురు మిత్రుల్ని అర్థించాడు శంకరం. అటువంటి అదృష్టవంతుల్లో అయిదో వాడు మన ఆనందరావు, ఇప్పుడు క్షమాపణ అందుకోవటం ఆనంద రావు వంతు. మామూలు పాఠం ఒప్పజెప్పాడు శంకరం.

షాక్ కొట్టినట్టు ఫీలయ్యాడు ఆనందరావు, 'ఇంతమందికీ సరిపడా ఉండి, నాదగ్గరకొచ్చేప్పటికి ఒక్క శుభలేఖ కరువై పోయిందా? మన స్సులో ఏదో పెట్టుకుని ఇన్సల్ట్ చెయటానికి వచ్చినట్టుందే!' అని చెప్పి విరుచుకుపడి, నాలుగూ ఝూ డించేశాడు.

తోడి గుమాస్తాలందరూ తనవేపే చూస్తున్నట్టు క్రీగంట కనిపెట్టి, లోలోపల పరవశించిపోతున్నాడు. శంకరం చల్లగా జారుకున్నాడు.

నిజానికి శంకరంమీద కోపం లేదు ఆనందరావుకి, అయినా ఒక ఫీలింగ్ వల్ల క్షణికంగా కలగిన ఉద్రేకం అతనిచేత ఇంత నిష్కర్షగా హెచ్చుస్థాయిలో పలికిం చింది, అంతే.

• • •

భార్యాపిల్లలూ ఇంటో లేక, ఆనందరావు ప్రస్తుతం ఒంటిగాడు కావటాన్ని అసలే ఏం తోచడంలే, పైగా - ప్రకాశంవల్ల పొందిన పరాభవం; శంకరం చేసిన అవమానం హృదయాన్ని దహించివేస్తున్నాయి. ప్రపంచంమీదే వైరాగ్యం గలిగిపోయింది తిన్నగా పార్కుకి చేరుకున్నాడు ఎవళ్ళూ చూడకుండా జుత్తు పీక్కున్నాడు; ఎవరూ తనని గుర్తించరా? ఈ లోకంలో తనకు గుర్తింపు లేనేలేదా?

పట్టపగలు పన్నెండు గంటలు, మిడనరిలగ్నం, చుర్రుమనే మండు టెండ, ఉదయభానుడు తన కర్తవ్యం నిర్వహిస్తున్నాడు. తోటమాలి నిశ్చింతగా గుర్రు పెట్టి నిద్రిస్తున్నాడు. ప్రశాంతంగా ఉన్నది పార్కు. ఆనందరావు ప్రశ్నకు జవాబు దొరకలేదు. మెల్లగా లేచాడు. శరీరం పట్టు తప్పింది. నీరసంగా అడుగులు వేసుకుంటూ పార్కునించే బయట పడ్డాడు.

• • •

మూసిన కన్ను తెరిచేనరికల్లా కిటకిటలాడుతూ చుట్టూ మూగివున్నారు జనం.

'ఎలా వుందండీ?' ప్రశ్నించింది ఆనందరావు భార్య.

'పలకరించ కండమ్మా! రెస్టు కావాలి ఆయనకి!' గుంపులోంచి ఒక గొంతు.

'ఎక్కడున్నానూ? ఏమిటి జనమంతా?' బాధపడుతూనే ఆశ్చర్యంగా అడిగాడు ఆనందరావు.

'మీరు రోడ్డు క్రాస్ చేసే టప్పుడు ... కారు గుద్దేసిందిటండీ ఈయనే కార్....' అంటూ ఏడుస్తూనే, భార్య పరిచయం చేసింది.

'క్షమించండి షంతులుగారూ! జరిగిపోయింది పొరపాటు, చికిత్స కయ్యే ఖర్చంతా నేనే పెట్టుకుంటా, నిక్షేపంలా కుదిర్చి మరీ పంపిస్తా. పూర్తిగా నయమయ్యే దాకా మీరిక్కడే మా ఇంటోనే ఉండురుగానిః! అని ప్రాధేయ పడ్డాడు కారు యజమాని_ఒక శ్రీమంతుడు, పొగడిన జనమంతా ఒక్కొక్కళ్ళే మళ్ళిపోయారు.

తృప్తాత్ముడయిన ఆనందరావు మళ్ళా ఒకసారి ధ్యానించుకున్నాడు_'హే భగవాన్! నాజీవితం సార్థకం చేశావు ప్రభూ! ఒక్కమాటుగా ఇంతమంది నన్ను గుర్తించటంకంటె నాకిహ కావాల్సిందేమిటి? జన్మ తరించిపోయింది. నీకివే జోహార్లు!' అని అనుకుంటూ వుండగా, డాక్టరిచ్చిన ఇంజెక్షన్ వల్ల చిన్న కునుకు పట్టింది.

---

—నీ అకంరం.

---